క్లుప్తంగా

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు ఇలా.. టమాటా రూ. 20, పచ్చిమిర్చి 45, బెండ 40, కాకర 35, దొండ 30, దోస 35, ఆలు 25, చామ 45, కీర 30, బీర 35, వంకాయ 30, గోకర 40, బీన్స్ 70, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 25, క్యారెట్ 50, చిక్కుడు 50, ఉల్లి 30 (1 కేజీ), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20–30, అల్లం 180, వెల్లుల్లి 180.

ఎమ్మెల్యే టికెట్‌కు దరఖాస్తు



దరఖాస్తు సమర్పిస్తున్న రవికుమార్

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గం టికెట్ ఆశిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ ప్రజల్లోనే ఉంటున్నాని, వచ్చే సాధారణ ఎన్నికలలో అవకాశం ఇస్తే గెలిచి నియోజకవర్గం అభివృద్ధి కోసం కృషిచేస్తా అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి, సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

వీరభద్రుడికి ప్రత్యేక పూజలు

జిన్నారం(పటాన్‌చెరు): వీరన్నగూడెం గ్రామంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. శ్రావణమాసం కావటంతో భక్తులు స్వామివారి సన్నిధిలో అభిషేకాలు, అమ్మవారి సన్నిధిలో కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులు సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామని ఈఓ శశిధర్, నిర్వాహకులు సోమయ్య తెలిపారు.

బాలుడికి అటవీ అధికారుల పరామర్శ



జిన్నారం(పటాన్‌చెరు): ఇటీవల కొండముచ్చు దాడిలో గాయపడిన గుమ్మడిదలలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థి సుజిత్‌కుమార్‌ను ఫారెస్టు అధికారులు మంజీత్‌సింగ్, నిజాముద్దీన్, నర్సింలు, ఎస్ మహ్మద్‌లు ఆదివారం పరామర్శించారు. అతడికి పలు సూచనలు చేశారు. కోతులు, కొండముచ్చులు గ్రామాల్లోకి రాకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

దేవాలయాల్లో మానసిక ప్రశాంతత

బండ్లగూడ: దేవాలయాల్లో మానసిక ప్రశాంతత లభిస్తుందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని రాధానగర్‌కాలనీలో హనుమాన్ దేవాలయం వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ పూజల్లో కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ హాజరై ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు.

గుంతల్.. చింతల్.. !



స్నేహితాహిల్స్‌కాలనీలో గుంతలమయంగా రోడ్లు

బండ్లగూడ: బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బహుళ అంతస్తుల నిర్మాణాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన మాత్రం నామమాత్రంగా కూడా లేవని స్థానిక ప్రజలు వెల్లడిస్తున్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని స్నేహితాహిల్స్ కాలనీలో రోడ్లు గుంతలమయంగా మారాయి. నగర శివారు ప్రాంతంలో ఉన్న ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని చెబుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులకు ఈ రోడ్ల దుస్థితిని పట్టించుకోవాలని కోరుతున్నారు. దీనిపై అధికారులకు పలుసార్లు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ @ 25 ఏళ్లు



ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ భవన సముదాయం

రాయదుర్గం: భారతదేశంలో నగరంలోని ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌కు ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇది దేశంలోనే పీపీపీ ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ మోడల్ తరహాలో 20 ట్రిపుల్‌ఐటీలు ఏర్పాటు చేయడం దీనికి ఉన్న ప్రాధాన్యత ఏపాటిదో గుర్తు చేస్తోంది. స్వయంప్రతిపత్తి కలిగిన ఉన్నత విద్యా సంస్థగా జాతీయ, అంతర్జాతీయంగా కూడా గుర్తింపు పొందడం విశేషం. ఇంతటి గుర్తింపు సాధించిన ఈ విద్యా సంస్థ ఏర్పడి 25 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం మరో విశేషం. ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ అనేది జాతీయ, అంతర్జాతీయ సంస్థల ఏర్పాటుకు స్ఫూర్తిగా నిల్వడం విశేషంగా చెప్పవచ్చు. ముఖ్యంగా టీ–హబ్, సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్(సీఐఈ), 21వ శతాబ్దపు గురుకులాల ఏర్పాటు, ఆర్‌జీయూకేటీ, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్మార్ట్



సిల్వర్‌జూబ్లీ జ్ఞాపకంగా ఏర్పాటు చేసిన చిహ్నం

గవర్నెన్స్(ఎన్‌ఐఎస్‌జీ) వంటివి ఏర్పాటుకు ట్రిపుల్‌ఐటీ మార్గదర్శకంగానే కాకుండా స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

50 మందితో ప్రారంభమై..

- 66 ఎకరాల స్థలంలో సెప్టెంబర్ 2, 1998లో ట్రిపుల్‌ఐటీని ఏర్పాటు చేశారు. మొదటి బ్యాచ్ విద్యార్థుల సంఖ్య 50 మంది ఉండగా ప్రస్తుతం 1896 మంది ఉన్నారు. అండర్ గ్రాడ్యుయేట్లు 1,146, పోస్టు గ్రాడ్యుయేట్లు 228, డాక్టోరల్ విద్యార్థులు 179 మంది.
- డేటా డ్రివెన్ రీసెర్చ్ ర్యాంకింగ్స్‌లో ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ దేశంలో నెంబర్ వన్ స్థానం. ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ ఆసియా ఖండంలో 30వ ర్యాంక్ ఉండగా ప్రపంచంలో 102 ర్యాంక్ ఉంది.

పిల్లలను ఒత్తిడికి గురి చేయొద్దు

హైదరాబాద్ క్రైమ్స్ డీసీపీ శిల్పవల్లి

గచ్చిబౌలి: మార్కులు, ర్యాంకులంటూ పిల్లలను ఒత్తిడి గురి చేయొద్దని హైదరాబాద్ క్రైమ్స్ డీసీపీ శిల్పవలి సూచించారు. ఆదివారం కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్‌లో రోష్నీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ×సే నో టు సూసైడ్¤ ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. తాను చేవెళ్లలో పని చేస్తున్న సమయంలో ఎక్కువగా రైతు ఆత్మహత్యల ఘటనలు చోటు చేసుకునేవని, వ్యవసాయంలో వచ్చే నష్టాలే కారణంగా గుర్తించామన్నారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో పాఠశాలలతో పాటు రైతులనూ చైతన్య పరిచే కార్యక్రమాలు నిర్వహించామని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. తల్లిదండ్రులు స్నేహపూర్వకంగా పిల్లలతో మాట్లాడినప్పుడే వారి సమస్యలు గుర్తించేందుకు వీలుంటుందన్నారు. భావోద్వేగానికి గురయ్యే వారికి రోష్నీ సంస్థ కౌన్సెలింగ్ ద్వారా ఓదార్పు, మనోధైర్యం ఇస్తుందన్నారు. టీఎస్ఎఫ్‌డీసీ వైస్ చైర్మన్, ఎండీ. డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ఆత్మహత్యలపై సమాజాన్ని చైతన్య పరిచేందుకు మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల మా స్నేహితుడి కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని, బాధను ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక ఆ కుంటుంబం మనోవేదనకు గురవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రోష్నీ సంస్థ డైరెక్టర్ స్వర్ణ, ప్రతినిధులు రత్న,విద్య పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న డీసీపీ శిల్పవల్లి

రైల్వే అండర్ పాస్ ముంపుపై ప్రజావ్యాజ్యం



మాట్లాడుతున్న గజ్జెల యోగానంద్

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి రైల్వే అండర్ పాస్ ముంపు ప్రాంతాలపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సౌత్ జోన్ బెంచ్‌లో ప్రజావ్యాజ్యం దాఖలు చేశామని గజ్జెల యోగానంద్ ఫౌండేషన్ ట్రస్టీ గజ్జెల యోగానంద్ తెలిపారు. ఆదివారం గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. గోపీ చెరువు, చాకలి చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్‌లో ఆక్రమణలు ఉండటంతో వరద రైల్వే అండర్ బ్రిడ్జి వైపు వస్తుండటంతో పరిసర ప్రాంతాల రోడ్లు, నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఆక్రమ నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. నాలుగు వారాల్లో నివేదికను సమర్పించాలని జీహెచ్ఎంసీ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సౌత్ జోన్ ఆదేశించిందని ఆయన తెలిపారు.

భూమయ్య మృతి తీరనిలోటు



భూమయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మియాపూర్: ఎంసీపీఐయూ రాష్ట్ర కమిటీ సభ్యులు పరికిరాల భూమయ్య మృతి తీరని లోటని రాష్ట్ర అధ్యక్షులు గాదగోని రవి అన్నారు. మియాపూర్‌లోని పార్టీ కార్యాలయంలో గ్రేటర్ హైదరాబాద్ సహాయ కార్యదర్శి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పరికిరాల భూమయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. భూమయ్య చిన్న వయస్సులోనే కమ్యూనిస్టు ఉద్యమానికి ఆకర్షితులై పేద, బడుగు, బలహీన వర్గాల కోసం తన జీవితాన్ని అంకితం చేశారని, ఆయన మృతి ప్రజా ఉద్యమాలు, ఎంసీపీఐయూ పార్టీకే కాకుండా యావత్ కమ్యూనిస్టు ఉద్యమాలకు నష్టమన్నారు. యువత ఆయన అడుగుజాడల్లో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వనం సుధాకర్, తుకారాంనాయక్, తాండ్ర కళావతి, పల్లె మురళి, భాగ్యమ్మ, దశరథ్ నాయక్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మంజుల రఘునాథ్‌రెడ్డి

మియాపూర్: చందానగర్ డివిజన్ పరిధిలోని విద్యానగర్ కాలనీలో అమెరికన్ కంటి ఆస్పత్రి, స్నేహ మల్టీస్పెషాలిటీ డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కంటి, దంత ఉచిత వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి ప్రారంభించారు. శిబిరంలో పాల్గొన్న వారికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాదాపూర్‌లో కంచికేఫ్ ప్రారంభం



కేఫ్‌ను ప్రారంభించిన దేవప్రసాద్‌దాస్‌జీ

మాదాపూర్: నగరవాసులకు ఉత్తేజాన్ని కలిగించే విధంగా టీ, స్నాక్స్ అందుబాటులో ఉన్నాయని టీ టైమ్, కంచికేఫ్ వ్యవస్థాపకుడు ఉదయ్ శ్రీనివాస్ తంగెళ్ల తెలిపారు. మాదాపూర్‌లో కంచికేఫ్‌ను ఆదివారం దేవప్రసాద్‌దాస్‌జీ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కంచి కేఫ్‌ను పవిత్రమైన కాంచీపురం ఆలయ ప్రేరణతో తీర్చిదిద్దినట్టు తెలిపారు. ఆలయంలోని వాతావరణం తలపించేలా ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్‌చెరు నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేట గ్రామ పరిధిలోని మైత్రి మేడోస్, మైత్రి విల్లా కాలనీ వాసులతో ఏర్పాటు చేసిన ముఖాముఖి సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఎమ్మెల్యేకు ఆత్మీయ స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. కాలనీల్లో తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీల్లో సీసీ రోడ్లు, అంతర్గత డ్రైనేజీలు, రక్షిత మంచినీరు అందించేందుకు ప్రణాళికతో నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. అనంతరం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని కృష్ణదేవరాయ కాలనీలో నూతనంగా నిర్మించిన కాలనీ కమ్యూనిటీ హాల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నరసింహగౌడ్, వైస్ ఎంపీపీ సునీత సత్యనారాయణ, సర్పంచ్ కృష్ణ, ఉప సర్పంచ్ ఫహీం, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

హామీలను పూర్తిస్థాయిలో అమలు చేశాం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేశామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం రామచంద్రాపురం పట్టణంలోని శ్రీనివాస్ నగర్ కాలనీ సోమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం సమీపంలో ఎమ్మెల్యే సొంత నిధులతో నిర్మిస్తున్న యాదవ కమ్యూనిటీ భవనానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధిలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. రామచంద్రాపురం, భారతినగర్ పటాన్‌చెరు డివిజన్‌లోని పలు సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని చూపమని తెలిపారు. ప్రజలకు ఏ సమస్య ఉన్న నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

జావెద్ హబీబ్ సెలూన్ ప్రారంభం



హెయిర్ కట్ చేస్తున్న జావెద్ హబీబ్

గచ్చిబౌలి: కొండాపూర్‌ని రాఘవేంద్ర కాలనీలో ఏర్పాటు చేసిన జావెద్ హబీబ్ హెయిర్ సెలూన్‌ను ప్రముఖ హెయిర్ స్టైలిస్ట్ జావెద్ హబీబ్ ప్రారంభించారు. అనంతరం పలువురు మోడళ్లకు హెయిర్ స్టైల్ కట్ చేసి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో సౌత్ ఇండియా జావెద్ హబీబ్ మాస్టర్ ఫ్రాంచేజ్ తేజా దేవి శెట్టి, మురళి పాల్గొన్నారు.

పోలీసన్నా.. మీ సేవలకు సలామన్నా..



ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఐటీ కారిడార్ రోడ్లపై గుంతలు పడ్డాయి. కొన్ని చోట్ల జీహెచ్ఎంసీ మరమ్మతులు చేసినప్పటికీ మరికొన్ని చోట్ల ట్రాఫిక్ పోలీసులే పూడ్చేస్తున్నారు. బయోడైవర్సిటీ జంక్షన్‌లో భారీ గుంత ఏర్పడటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. ఆదివారం సెలవు రోజు కావడంతో రాయదుర్గం ట్రాఫిక్ సీఐ శ్రీనాథ్ ఆధ్వర్యంలో కాంక్రీట్‌తో గుంతను పూడ్చడంతో స్థానికులు, వాహనదారులు అభినందించారు. - గచ్చిబౌలి

దుర్గమ్మ దీవెనలు అందరిపై ఉండాలి

ఎన్ఎంఆర్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు నీలం మధు

పటాన్ చెరు: దుర్గమ్మ తల్లి దీవెనలు అందరిపై ఉండాలని ఎన్ఎంఆర్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. అమీన్‌పూర్ మండలం పటేల్ గూడ గ్రామంలో ఆదివారం శ్రావణమాస దుర్గమ్మ బోనాల కార్యక్రమానికి నీలం మధు ముదిరాజ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు ఆయన్ను సన్మానించారు. అమీన్‌పూర్ ఎంపీపీ ఈర్ల దేవానంద్, సర్పంచ్ నితిశశ్రీకాంత్, పటేల్ సుధాకర్, రాము, రాజుగౌడ్, తలారి రాజు, అశోక్, సుధాకర్, సంతోష్, వినోద్, వెంకటయ్య, చందు, వెంకటేశ్, కిషోర్, గణేశ్, జాతర నిర్వాహకులు, యువసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు



మాట్లాడుతున్న ప్రతినిధులు

సాక్షి, సిటీబ్యూరో: అధునాతన సాంకేతికత ఆధారంగా, వినూత్న పద్ధతులతో వ్యవసాయదారుల ఉన్నతమైన భవిష్యత్ కోసం కృషి చేస్తున్నామని గ్రోవెర్ టెక్నాలజీస్ వ్యవస్థాపకులు పీజే శ్రీకాంత్ తెలిపారు. సుస్థిర వ్యవసాయ ప్రక్రియ, ఆహార భద్రతపై తమ సేవలను ఆంధ్రప్రదేశ్‌తో పాటు బెంగళూరులోనూ ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తమ భవిష్యత్ ప్రణాళికలను ప్రకటించారు. రైతులు పంటలు పండించే విధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడం, ఉత్పాదకతను పెంచడం లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఇందులో భాగంగా సాంకేతికతను రైతుల చెంతకు చేర్చేలా వేదికలను రూపొందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సీఈఓ నవదీప్ మెహతా, సేల్స్ హెడ్ భాస్కర్ పాల్గొన్నారు.

కత్తిపద్మారావు దళిత తత్వశాస్త్ర ప్రతిపాదకుడు

రాయదుర్గం: దళిత తత్వశాస్త్ర ప్రతిపాదకుడు డాక్టర్ కత్తిపద్మారావు అని హెచ్‌సీయూ తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సేవ తెలుగు భాషా, సాహితీ సాంస్కృతిక సంస్థ నెల్లూరు, తిరుపతి వారి ఆధ్వర్యంలో అంతర్జాలం ద్వారా జరుగుతున్న డాక్టర్ కత్తి పద్మారావు సాహితీ సప్తాహంలో భాగంగా ఆదివారం ఆయన గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ద్వారా మాట్లాడారు. దళితుల అభ్యున్నతి జ్యోతిరావు పూలే, డాక్టర్ అంబేడ్కర్ తాత్విక ఆలోచనలతోనే ముడిపడి ఉందన్నారు. తెలుగులో జాషువా సాహిత్యంలో తొలిసారిగా ప్రచారం చేశారని, దళిత తాత్విక శాస్త్రాన్ని రూపొందించి ప్రచారం చేసిన గొప్ప సాహితీవేత్తగా కత్తిపద్మారావు గుర్తింపు పొందారన్నారు. యూరఫ్ కేంద్రంగా కారల్‌మార్క్స్ పెట్టుబడి దారి వ్యవస్థ నశించడానికి గతి తార్కిక చారిత్రక భౌతికవాదాన్ని ప్రతిపాదించి ప్రతి సమస్య పరిష్కారాన్ని ఆర్థికాంశాలతో ముడి పెట్టారని, కానీ భారతీయ సమాజాన్ని కులం కేంద్రంగా అర్థం చేసుకోవడానికి పూలే, అంబేడ్కర్ ప్రయత్నించి కుల నిర్మూలన సిద్ధాంతాన్ని ప్రతిపాదించారని కత్తి పద్మారావు శాస్త్రీయంగా నిరూపించారన్నారు. రాజమండ్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు ఆచార్య కాకాని సుధాకర్, సేవ అధ్యక్షులు కంచర్ల సుబ్బానాయుడు, సేవ కార్య నిర్వాహకులు బోర భారతీదేవి, డాక్టర్ కొణిదల శోభ, ప్రముఖ కవి ఆకాష్ ప్రసంగించారు.



నృత్యం.. మంత్రముగ్ధం

మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం కూచిపూడి గ్రామం నుంచి వచ్చిన కూచిపూడి గురువు చింతారవి బాలకృష్ణ శిష్యబృందంచే ఏర్పాటు చేసిన ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకున్నాయి. అంబపరకు, నర్తన, గణపతిం, జానుత శబ్దం, మహిసాషుర మర్థిని, చిదంబరాష్టకం, గరుడగమన రారా, దశావతారాలు, రావణాస్తవం, రామాయణ శబ్దం, కృష్ణం వందే జగద్గురు తదితర అంశాలను కళాకారులు సుష్మిత, శ్రావ్య, రామలీల, హరిశ్రీ, ధన్యశ్రీ, జాహ్నవి, ప్రజ్ఞాచౌదరి, త్రిషిత, ఆరతి, అనన్య, జస్విత, నందిని ప్రదర్శించి ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశారు.

–మాదాపూర్

ఆదిత్యనగర్ సమస్యలను పరిష్కరిస్తా

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్‌లో ఆదివారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదిత్యనగర్ కాలనీ వాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలను పరిగణలోకి తీసుకొని, వారి విజ్ఞప్తి మేరకు కాలనీలో పాదయాత్ర చేపడుతున్నామని అన్నారు. ప్రజా సమస్యలే పరిష్కార ధ్యేయంగా ముందుకెళ్తున్నామని అన్నారు. కాలనీవాసులు సమష్టిగా ఉంటూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. వర్క్‌ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కాలనీవాసులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రావు, రాంబాబు, సత్యవరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మళ్లీ కురిసింది.. వరద పారింది

నగరంలో ఆదివారం కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద భారీగా నిరు చేరడంతో బ్రిడ్జికి రెండువైపులా బారికేడ్లను పెట్టి వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. లింగంపల్లి నుంచి గచ్చిబౌలి వైపు వెళ్లే వాహనాలను నల్లగండ్లలోని ఆర్‌టీబీ మీదుగా మళ్లించారు. రాకపోకలను నిలిపివేసిన విషయం తెలియక చాలా మంది అక్కడి దాకా వచ్చి తమ వాహనాలను మళ్లించుకుని వెళ్లిపోయారు.

– శేరిలింగంపల్లి